

## వణికిస్తున్న డయేరియా

పాడైఖదర్‌లో అతిసారా బాధితులు పెరుగుతున్నారు. గ్రామంలో వైద్యుల బృందం పర్యటించి వివరాలు ఆరా తీశారు.

- 8లో



## ఆకట్టుకున్న కార్టూన్ షో

సరస్వతీ శిశు విద్యామందిర్‌లో నిర్వహించిన కార్టూన్ షో అలరించింది. వివిధ అంశాలపై కార్టూన్లు ప్రదర్శించారు.

- 8లో



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

ఒడిశాలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి బిభూతి జెన్నా హామీ ఇచ్చారు.

- 8లో

## న్యూస్‌రీల్

### 152 లీటర్ల సారా స్వాధీనం



సారాతో పట్టుబడిన నిందితులు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన కెరడ, ఒనిజ, చందిలి, అమలాభట్ట, భొయిమోడ, పండ్రతొల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 152 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 8 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ దాస్, ఓఐసీ సంజయ్ ప్రధాన్ నేతృత్వంలో సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. అరెస్టయిన వారిలో కెరడ గ్రామానికి చెందిన బిడిక పద్మ, చిలి కమ్మ మండంగి, శ్యామల ఇందు, రాయిపల్లి నిర్మల, ఒనిజ గ్రామానికి చెందిన మెలక అండయ్య, ఇప్పిలి గౌరి, దీపక్ కుమార్ బిడిక, సరస్వతి సునాసాగొడా ఉన్నారు.

### సారాతో ఐదుగురు అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

జయపురం: బలియ ప్రాంతంలో పెట్రోలింగ్ జరుపుతుండగా నాటు సారా తరలిస్తూ ఐదుగురు పట్టుబడ్డారని జయపురం అబ్కారీ అధికారి నీలాద్రి బిహారి మిశ్రా తెలిపారు. రెండు బైకులపై రబ్బరు ట్యూబులలో 100 లీటర్లకు పైగా సారా తరలిస్తున్నారని చెప్పారు. అరెస్టయిన వారిలో జయపురం సమితి గొడాపాదర్ పంచాయతీ కొలాగుడ గ్రామానికి చెందిన ఆశిష్ కందపాన్, నీలాగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ నాయిక్, సాను భయిష్, బలరాం భయిష్, బొయిపరిగుడ సమితి కుసుమగుడ గ్రామానికి ఖఘుపతి బిశాయి ఉన్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ స్వాగతిక మహంతి, ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్త్ తదితరులు పాల్గొన్నారు.

### అప్పు చెల్లించమంటే గొంతు కోశాడు!


● సికరపాయిలో యువకుడిపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాహుల్ వడక

రాయగడ : జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సికరపాయిలో ఆదివారం ఓ యువకుడిపై హత్యాయత్నం ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన యువకుడు కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి చిలిశంఖ ప్రాంతానికి చెందిన రాహుల్ వడక గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. చిలిశంఖ ప్రాంతానికి చెందిన రాహుల్ కొన్నాళ్ల కిందట సికరపాయి గ్రామానికి చెందిన ఒక యువకుడికి కొంత మొత్తం అప్పుగా ఇచ్చాడు. ఈ క్రమంలో తీసుకున్న డబ్బులను తిరిగి ఇస్తానని చెప్పడంతో రాహుల్ ఆదివారం సికరపాయి వెళ్లాడు. ఇద్దరి మధ్య డబ్బుల విషయమై గొడవ జరగడంతో ముందస్తు పథకం ప్రకారం తన వద్ద ఉంచిన పదునైన కత్తితో రాహుల్ గొంతుకోశాడు. రాహుల్ చనిపోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న రాహుల్‌ను చూసిన స్థానికులు వెంటనే సికరపాయి పీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న రాహుల్ తండ్రి నర్సి వడక వెంటనే సికరపాయికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం కుమారుడ్ని జిల్లా కేంద్రాసుపత్రిలో చేర్పించా రు. తన కుమారుడిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి సికరపాయి గ్రామానికి చెందిన శంకర్ నాయక్ అని, అతనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో నర్సి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చిత్రకొండ జలాశయంలో వృద్ధుడి మృతదేహం



మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జోడాంబో పంచాయతీ తోటగూడ గ్రామం వద్ద చిత్రకొండ జలాశయంలో ఆదివారం వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పరిసర ప్రాంతాల్లో ఆరా తీయగా కొరాపుట్ జిల్లా బైపరగూఢ సమితి జాబా గ్రామానికి సుక్రు గోలారి (70)గా గుర్తించారు. జోడాంబోలో బంధువుల ఇంటికి వచ్చిన ఈయన మూడు రోజులుగా కనిపించలేదు. ఇంటికి వెళ్లిపోయాడని బంధువులు భావించారు. ఇంతలో శవమై తేలడంతో విషాదంలో మునిగిపోయారు. వృద్ధుడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి జలాశయంలో జారిపడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

## ● నేత్రదానంపై అవగాహన



ప్రతిఒక్కరూ నేత్ర పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివార బ్రహ్మపురలో ఎంకేసీజీ వైద్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం ఆస్పత్రి సూపరింటెండెంట్ సుచిత్ర దాస్, సామాజిక కార్యకర్తలు బి.నాగేశ్వర సుబుద్ధి, జమ్ముల సురేష్, కొంచాడ పురుషోత్తం, ఎం.విద్యాసాగర్, నందేషు సేనాపతి, ఎ.రామచంద్ర రావు పాల్గొన్నారు.

- కొరాపుట్

## ● అత్యాచారంపై నిరసన




కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా ఆదివారం జయపురంలోని డాక్టర్ సునయన కాలేజ్ ఆఫ్ మెడికల్, సైన్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. విక్రమదేవ్ విశ్వవిద్యాలయం, జయపురం ఫార్మసీ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

- జయపురం

## ● ఆధ్యాత్మిక ఉత్సవం



అలేఖ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నబరంగ్‌పూర్ జొరిగాం సమితిలోని చటాగుడ, టుటిగుడ గ్రామాల్లో ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. నవాన్న భక్ష ఉత్సవ్ పేరిట అఖండ జ్యోతి వెలిగించి పూజలు చేశారు. ముందు రోజు రాత్రి శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం వేలాది మందితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, కలహండి తదితరులు పాల్గొన్నారు.

- కొరాపుట్

# మద్యం.. ఏం చేద్దాం!

- సవాల్‌గా మారిన మద్య నిషేధం హామీ
- అమలు చేస్తే ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- కొత్త పథకాల అమలుపైనా ప్రభావం
- మరోవైపు సర్కారును కుదిపేస్తున్న కల్తీ సారా ఘటన





చికిటిలో బీజేడీ నిజ నిర్ధారణ బృందం పర్యటన(ఫైల్)



పృథ్వీరాజ్ హరిచందన్, అబ్కారీ శాఖ మంత్రి

భువనేశ్వర్ : ఓ వైపు కల్తీ సారా ఘటన రాష్ట్ర ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తుంటే.. మరోవైపు మద్య నిషేధం హామీ అమలు పెను సవాల్‌గా మారింది. బీజేపీ అధికారంలోకి వచ్చి వంద రోజులు కాకముందే గంజాం జిల్లా చికిటి మండలం జెనాపూర్ కల్తీ సారా మరణాలు పాలకులను కుదిపేస్తున్నాయి. మద్య రహిత రాష్ట్రమే ధ్యేయమంటూ పగ్గాలు చేపట్టిన బీజేపీకి తాజా విషాద ఘటన మింగుడుపడనీయడం లేదు. ముఖ్యంగా అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ విషయంలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

**నిషేధం సాధ్యమేనా?**

మద్య నిషేధం సాధ్యాసాధ్యాలు రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. హామీ ప్రకారం నిషేధం విధిస్తే రాష్ట్ర ఖజానాకు భారీగా గండి పడే అవకాశం ఉంది. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో సింహభాగం అబ్కారీ శాఖదే. సమగ్ర ఆదాయంలో దీని వాటా దాదాపు 15 శాతం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సమగ్ర సొంత పన్ను ఆదాయం రూ. 53,000 కోట్లు కాగా అందులో అబ్కారీ ఆదాయం దాదాపు రూ. 8000 కోట్లు. ఇందులో ఎక్కువ భాగం మద్యం విక్రయాల నుంచే వచ్చిందే. మద్య రహిత రాష్ట్రం వాగ్దానానికి కట్టుబడి ఉంటే ఈ ఆదాయం చేజార్చుకోవాల్సిందే.

**కొత్త పథకాల భారం..**

ఎన్నికల హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పలు కొత్త పథకాల్ని ప్రవేశ పెట్టాల్సి ఉంది. వీటి కార్యాచరణకు పెద్ద మొత్తంలో నిధుల సమీకరణ అనివార్యం. ఓవైపు అదనపు నిధుల అవసరం పొంచి ఉండగా.. మరో వైపు మద్యం నిషేధించి భారీ ఆదాయ వనరుని చేజార్చుకోవడం ఇప్పటి పరిస్థితుల్లో దాదాపు అసాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కొత్త మద్యం పాలసీ..**

ఎన్నికల హామీ ప్రకారం మద్య రహిత రాష్ట్రం కార్యాచరణలో భాగంగా సరికొత్త మద్యం విధానం తీసుకురానున్నట్లు మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్ ఇటీవల ప్రకటించారు. అయితే ప్రత్యామ్నాయ ఆదాయ వనరులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటారో మాత్రం స్పష్టత ఇవ్వలేదు.

**ముమ్మర దాడులు..**

రాష్ట్రంలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు ముమ్మరం చేసే యోచనతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీనియర్ ఐపీఎస్ అధికారులను అబ్కారీ శాఖ కమిషనర్‌గా నియమించింది. రాష్ట్రంలో నడుస్తున్న అన్ని అక్రమ మద్యం నెట్‌వర్క్‌లను ట్రాక్ చేయడానికి అబ్కారీ కమిషనర్ ఆధ్వర్యంలో స్వతంత్ర ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను పటిష్టపరుస్తోంది. వీరు రాత్రింబవళ్లు నిఘా పెట్టి దాడులు చేస్తేనే రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలకు కళ్లెం పడుతుంది. దీంతో మద్యం విక్రయాల క్రమబద్ధీకరణ సాధ్యమై సారా అమ్మకాల్లో నిధులు పక్క దోవబట్టకుండా పూర్తి స్థాయిలో రాష్ట్ర ఖజానాకు చేరగలిగే అవకాశం ఉంటుంది. మద్య రహిత రాష్ట్రం ఆవిష్కరణలో ముందుగా కల్తీ సారాను అడ్డుకుంటేనే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వేలాడుతున్న రాజీనామా కత్తి..**

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాల్సిన అబ్కారీ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్‌కు రాజీనామా ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా చికిటి కల్తీ సారా ఘటన ఇందుకు కారణంగా నిలుస్తోంది. గతంలో కల్తీ సారా మృత్యు ఘటనలు అప్పటి అబ్కారీ మంత్రుల్ని గద్దె దింపేశాయి. ప్రస్తుతం అదే పరిస్థితి మంత్రికి ఎదురవుతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి.



జెనాపూర్‌లో గ్రామస్తుల ఆందోళన(ఫైల్)



శాసన సభలో విపక్షాల గందరగోళం(ఫైల్)

# మృత్యు గోడ



సామంతి మృతదేహం

- కులుముహి గ్రామంలో గోడ కూలి బాలిక మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



బొర్జాకు సాయం అందిస్తున్న సబ్ కలెక్టర్ కల్యాణి



చికిత్స పొందుతున్న సరోజ్



కుడుంజి వడక

రాయగడ: గోడ కూలిన ఘటనలో ఓ బాలిక మృతి చెందగా.. మరో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. కళ్యాణసింగుపూర్ సమితి ధమునిపొంగ పంచాయతీ కులుముహి గ్రామంలో శనివారం రాత్రి ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుటుముహి గ్రామానికి చెందిన బొర్జా వడక తన భార్య కుడుంజి, పెద్ద కుమార్తె సామంతి(12), చిన్న కుమార్తె సంజన, కుమారుడు సరోజ్‌తో కలిసి శనివారం రాత్రి భోజనాలు చేసి ఒకేచోట పడుకున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీరుంటున్న ఇంటిలో మట్టి గోడ నానిపోవడంతో ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో గోడ కింద ఇరుక్కుపోయిన సామంతి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. గోడ కూలిన శబ్దం విన్న ఇరుగుపొరుగు వెంటనే వచ్చి మట్టి గొడలను తొలగించి మిగిలిన వారిని బయటకు తీశారు. గాయపడిన వారిని అంబులెన్సులో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సామంతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..**

గోడ కూలిన ఘటనలో బాధిత కుటుంబానికి జిల్లా యంత్రాంగం ఆర్థిక సహకారాన్ని అందించింది. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, ఎమర్జెన్సీ అధికారి లలిత్ మండల్, జిల్లా ప్రాజెక్టు అధికారి జ్యోతిర్మయి పాత్రో ఆదివారం జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం రెడ్ క్రాస్ నిధుల నుంచి పదివేల రూపాయలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30 వేల సాయం అందించారు.

# గనుల తవ్వకాలపై సమగ్ర దర్యాప్తు



సీఎంకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత, గిరిజనులు

కొరాపుట్: గనుల తవ్వకాలపై సమగ్ర దర్యాప్తు చేయిస్తానని, ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి మొహన్ చరణ్ మజ్జి హామీ ఇచ్చారు. గనుల ప్రభావిత ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను ఆదుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌కు చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత నేతృత్వంలో బాధితులు ఆదివారం రాజధాని భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్‌లో సీఎంను కలిశారు. కొడింగా మాలి ప్రాంతంలో బాక్సైట్ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని, వేల టన్నుల ముడి సరుకు తరలిస్తున్నారని చెప్పారు. అయితే నిబంధనల ప్రకారం ఎటువంటి సంక్షేమ పనులు చేయడం లేదన్నారు. సమీప రాయగడ జిల్లా టికిరి ప్రాంతంలో ప్రజలకు అందుతున్న సదుపాయాలు తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని గనుల ప్రాంతాల్లో నిబంధనల అమలుపై దర్యాప్తు చేయాలని కోరారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయం వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి స్పందిస్తూ అక్కడ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయిస్తానని హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కాగితాలతో బొమ్మలు చేస్తున్న చిన్నారులు

జయపురం: ఈ నెల 31న జరగనున్న స్థానిక స్వయం పాలన దినోత్సవం (లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్) సందర్భంగా జయపురం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, పేపర్లతో బొమ్మలు తయారు చేయటం, క్విజ్ పోటీలు నిర్వహించారు. తెలుగు సాంస్కృతిక సమితి వారి సిటీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు. సోషియల్ ఎడ్యుకేషనల్ ఎన్విరాన్‌మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్(సీవా) సంస్థ సహకారంతో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 31న సంఘం కళ్యాణ మండపంలో నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



రవాణా మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర, గోవింద్ జైన్

కొరాపుట్:

జొరిగాం నుంచి రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని జొరిగాం నియోజకవర్గ ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర కోరారు. ఈ మేరకు ఆదివారం రాజధాని భువనేశ్వర్‌లో రవాణా శాఖ మంత్రి బిబుతి భూషణ్ జెన్నాను కలిశారు. రాష్ట్రంలో చివరి సమితి కేంద్రమైన మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో రవాణా సదుపాయాలు లేవని చెప్పారు. రాజధానికి రావాలంటే వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోందన్నారు. జొరిగాం నుంచి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు మరో బస్సు వేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి సూర్య వంశీ సూరజ్‌ను కలిశారు. జొరిగాంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గోవింద్ జైన్ ఉన్నారు.

# మొబైల్ హాస్పిటల్ సేవలు ప్రారంభం



జెండా ఊపి సేవలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

రాయగడ:

స్థానిక న్యూకాలనీలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మొబైల్ హాస్పిటల్ సేవలు ప్రారంభమయ్యాయి. మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ టి.శ్రీనివాస్‌రావు పచ్చజెండా ఊపి బస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ హరీష్ మాట్లాడుతూ సత్యసాయి మానవ సేవే మాధవ సేవగా జీవితాన్ని సేవా కార్యక్రమాలకే అంకితం చేశారని చెప్పారు. ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. మైత్రీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. జిల్లాలో మొదటిసారిగా సత్యసాయి సంస్థ గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తుండటం అభినందనీయమని మైత్రీ సీఈఓ సత్యనారాయణ అన్నారు. అంతకుముందు భజన, వేద పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, భువనేశ్వర్ కేపిటల్ హాస్పిటల్ సంచాలకుడు డాక్టర్ పి.కె.దాస్, సత్యసాయి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సత్య స్వరూప్ పట్నాయక్, తూర్పు జోన్ అధ్యక్షుడు నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్శిటీ అవల పాటి కోట గ్రామం వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గురించారు. సమాచారం అందుకున్న గురండి పోలీసు ఐఐసీ రబీంద్ర పాత్రో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పురుగులు తినేయడంతో ముఖం గుర్తుపట్టని విధంగా తయారైంది. అనంతరం పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచారు.

### అరసవల్లి ఈఓగా రమేష్‌బాబు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయ ఈఓగా డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు రెగ్యులర్ బాధ్యతలను ఆదివారం సాయంత్రం చేపట్టారు. ఇటీవల దేవదాయ శాఖ బదిలీల ప్రక్రియలో భాగంగా వర్కింగ్ అరేంజ్‌మెంట్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఇంతవరకు ఇదే విధానంలో ఈఓగా విధులు నిర్వర్తించిన ఎస్.చంద్రశేఖర్ తిరిగి అన్నవరంలో డిప్యూటీ ఈఓగా వెళ్లిపోవాల్సి వచ్చింది. అలాగే అరసవల్లి ఆలయ ఈఓగా రెగ్యులర్ డీసీగా ఉంటూ అన్నవరంలో వర్కింగ్ అరేంజ్‌మెంట్స్‌పై పని చేస్తున్న రమేష్‌బాబు కూడా తిరిగి ఇక్కడే రెగ్యులర్ విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలతో పాటు వేదాశీర్వచనాన్ని అందజేశారు.

### డాక్టర్ ముత్యంకు ఘనంగా నివాళి


డాక్టర్ ముత్యంకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం శ్రీకాకుళం ఉద్యమం సాహిత్య పరిశోధక రచయిత, బహుగ్రంథ కర్త డాక్టరు ముత్యం సంతాప సభ నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లోని తన స్వగృహంలో డాక్టరు ముత్యం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లాతోను, ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంతోను ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అ నంతరం పలువు వక్తలు మాట్లాడుతూ ముత్యం ఘనతలను గుర్తు చేసుకున్నారు.

### గెడ్డలో పడి వ్యక్తి మృతి


దండుగెడ్డలో పడి మృతి చెందిన దీనబందు

ఇచ్ఛాపురం రూరల్: మండలం ఇన్నేశుపేట గ్రామంలోని దండుగెడ్డలో పడి ఈదుపురం గ్రామానికి చెందిన గాలి దీనబందు (57) మృతి చెందినట్లు పోలీసులు కనుగొన్నారు. దీనబందు శనివారం సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి రాలేదని, ఆదివారం ఉదయం దండు గెడ్డలో శవమై తేలాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని నీటి నుంచి మృతదేహాన్ని బయట కు తీసి శవ పంచనామాకు ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. నడక దారిన వెళ్తూ ప్రమాదవశాత్తు కాలుజారి గెడ్డలో పడి మృతి చెంది ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### నేడు హిందీ మంచ్, ఇంటలెక్చువల్స్ ఫోరం కార్యవర్గ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ మంచ్ సంస్థ, ఏపీ ఇంటలెక్చువల్స్ ఫోరం సంస్థల కార్యవర్గ సమావేశాలను సోమవారం నిర్వహిస్తున్నట్లు హిందీ మంచ్ అధ్యక్షులు దొంతం పార్వతీశం, ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి పొట్నూరు వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు సంస్థల సమావేశాలు సోమవారం ఉదయం 9 నుంచి 11 మధ్య శ్రీకాకుళం నగరంలోని గూనపాలెంలో ఉన్న శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నట్టు చెప్పారు.

# వణికిస్తున్న డయేరియా

- పాడైఖదర్‌లో మరో నలుగురికి అతిసార
- గ్రామంలో పర్యటించిన వైద్యుల బృందం


పాడైఖదర్‌లో పరిస్థితిపై చర్చిస్తున్న అధికారులు

జయపురం: సీజనల్ వ్యాధులు పల్లెవాసులను వణికిస్తున్నాయి. జయపురం జిల్లా బొయిపరిగుడ సమితి బిజాపూర్ పంచాయతీ పాడైఖదర్ గ్రామంలో డయేరియా తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే డయారియా బారిన పడి ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం మరో ఐదుగురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్‌లో చేరారు. ఇప్పటికే పలువురు గ్రామస్తులు ఇక్కడ అతిసార నివారణకు చికిత్స పొందుతున్నారు.

**అధికారుల ఆరా..**

బొయిపరిగుడ హాస్పిటల్ వైద్యుల బృందం ఆదివారం పాడైఖదర్‌లో పర్యటించింది. అతిసార వ్యాప్తికి గల కారణాలపై అన్వేషించింది. గ్రామంలో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించింది. రోడ్డు, మురుగుకాలువలు, బావుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామస్తులు వినియోగిస్తున్న తాగునీటిని పరీక్షించేందుకు నమూనాలను ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో బీడీఓ భాస్కరచంద్ర సాహు, కమ్యూనిటీ హాస్పిటల్ అధికారి డాక్టర్ విశ్వజిత్ భుయ, చికాపూర్ సర్పంచ్ రాజు ఖిలో, సమితి సామాజిక సురక్షా అధికారి కార్తీక పాఢి, గ్రామీణ తాగునీరు, శానిటేషన్ విభాగ అధికారులు పాల్గొన్నారు.


బొయిపరిగుడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

## ఆటో బోల్తా

- 10 మంది విద్యార్థులకు గాయాలు


గాయపడిన విద్యార్థి

రాయగడ: ఆటో బోల్తా పడిన ఘటనలో పది మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జిల్లాలోని మునిగుడ సమితి అంబొదళ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంజురుకుప ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబొదల గ్రామానికి చెందిన పది మంది విద్యార్థులు మునిగుడలోని ఆదర్శ పాఠశాలకు ఆటలో బయలుదేరారు. ముంజురికుప వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సామ్యరంజన్ కౌరొకొరియా, మెమో కౌరొకొరియా, టుని బాగ్, సానియా బాగ్‌లు తీవ్రంగా గాయపడగా..మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను అంబొదల పీహెచ్‌పీలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

## దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు



జయపురం: యువకుడిని కత్తితో బెదిరించి మొబైల్, డబ్బు దోచుకుపోయిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి ఆదివారం తెలిపారు. శుక్రవారం రాత్రి కొశాగుమడకు చెందిన డొంబురు దొర రోడ్డు పని చేస్తుండగా ఖొరిముండ గ్రామానికి చెందిన రుపు హరిజన్ కత్తి పట్టుకుని వచ్చాడు. డొంబురును బెదిరించి అతడి వద్ద మొబైల్ ఫోన్, రూ.3500 దోచుకొని పారిపోయాడు. దీంతో బాధితుడు జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు రుపు హరిజన్‌గా గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బ్రహ్మపురలో మన్ కీ బాత్


ప్రధాని ప్రసంగం వింటున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కొరాపుట్: బ్రహ్మపురలోని ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమానికి బాలాసోర్ పార్లమెంట్ సభ్యుడు ప్రతాప్ షడంగి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 113వ ఎపిసోడ్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌తో కలిసి ఎంపీ ప్రధాని సందేశం విన్నారు. కార్యక్రమంలో గంజాం జిల్లా పార్టీ అధ్యక్షుడు సుభాష్ సాహు, సీనియర్ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సేవలు భేష్


వేదికపై ప్రదీప్ మజ్జి, రమేష్ జెన్నా, హిమాంశు శేఖర్ సాహు

కొరాపుట్ : పాత్రికేయులే సమాజంలో జరిగే మంచి చెడులకు ప్రసార సాధకులని బిజూ జనతాదళ్ జాతీయ అధికార ప్రతినిధి, నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి అన్నారు. ఆదివారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేటు హోటల్లో ఆల్ ఒడిశా రిపోర్టర్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో మజ్జి ప్రసంగించారు. విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న వెబ్ మీడియా వల్ల ఎటువంటి రహస్యాలు దాగడం లేదన్నారు. మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా పత్రికా రంగానికి అడ్డు ఉండదన్నారు. అనంతరం ఉత్తమ రిపోర్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో సన్నఖెముండి ఎమ్మెల్యే రమేష్ జెన్నా, ధర్మశాల హిమాంశు శేఖర్ సాహు, బీజేపీ క్రుషక్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లిపున్ మెహన్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ చోరులు అరెస్టు


పట్టుబడిన నిందితులతో పోలీసు

కొరాపుట్: మొబైల్ షాపులో దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఎస్ఐ సబీర్ అహ్మద్ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రి సమీపంలో మొబైల్ షాపులో షట్టర్లు తొలగించి చోరీకి పాల్పడ్డారు. యజమాని రమాకాంత్ దాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సమీప కోయగుడ గ్రామానికి చెందిన రాజేష్ హరిజన్, మరో ఇద్దరు మైనర్లు ఈ దొంగతనం చేసినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 3 స్మార్ట్ ఫోన్లు, రెండు కీ ప్యాడ్ ఫోన్లు, 3 స్పీకర్లు, ఇయర్ బడ్, బ్లూటూత్, ఐరన్ రాడ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

## పోస్టుమాస్టర్ అనుమానాస్పద మృతి


నందో మడ్కమి(ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి మట్టేర్ గ్రామంలో శనివారం సాయంత్రం పోస్టుమాస్టర్ నందో మడ్కమి (52) అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై తేలారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఈయన కనిపించకపోవడంతో భార్య సుకాంతి అన్నిచోట్లా వెతికారు. అయినా ఆచూకీ లేకపోవడంతో పోడియా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో చెరువులో స్నానానికి వెళ్లిన చిన్నారులు తేలిన మృత దేహాన్ని చూసి గ్రామస్తులకు చెప్పారు.

వారు వచ్చి చూడగా సగం కాలి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

జయపురం: మద్యం తాగి వాహనం నడుపుతున్న కర్ణాటక రాష్ట్రం ఆర్.బి.చంద్రశేఖర అనే ట్రక్ డ్రైవర్‌ను జయపురం పట్టణ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు. పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా పట్టుబడినట్లు తెలిపారు.

### అమర జవాన్ స్థూపం నిర్మించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అమర జవాన్ స్థూపం ఏర్పాటు చేయాలని జిల్లా మాజీ సైనిక సమాఖ్య అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లివీధిలోని తమ కమ్యూనిటీ హాల్‌లో మాజీ సైనికులు, వీరనారులు, కటుంబ సభ్యులతో ఆది వారం ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్ణచంద్రరావుతోపాటు శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కెప్టెన్ పి.ఈశ్వరరావు(రిటైర్డ్), ఎల్.ఎల్.రావు, వి.సూర్యనారాయణ, ఎస్.రామకృష్ణ, తదితరులు మాట్లాడారు. మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇటీవల వీర మరణం పొందిన జిల్లా సైనికులను స్మరించుకుంటూ కొద్ది సేపు మౌనం పాటించారు. ఇటీవల విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ సైనికుల కవాతులో మన జిల్లా నుంచి పాల్గొన్న హవాల్దార్ ఇ.రాజారావు(రిటైర్డ్)ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సమాఖ్య ట్రెజరర్ ఎమ్.సింహాచలం, జి.అమ్మన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కబడ్డీ సంఘం, శ్రీకాకుళం నూతన కార్యవర్గం ఎన్నికై ంది. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని డీఈఓ కార్యాలయం సమీపంలో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాయంలో జిల్లా కబడ్డీ సంఘ కార్యవర్గ సమావేశంతోపాటు నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించా రు. ముందుకు తయారుచేసిన కార్యవర్గాన్ని చదివి వినిపించి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. జిల్లా కబడ్డీ సంఘానికి చైర్మన్‌గా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను నియమించుకున్నారు. మిగిలిన కార్యవర్గాన్ని ప్రకటించారు.

**నూతన కార్యవర్గం ఇదే**

జిల్లా కబడ్డీ సంఘ శ్రీకాకుళం చైర్మన్‌గా గొండు శంకర్, అధ్యక్షుడిగా నక్క కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి గా సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సాధు శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగళ్ల రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.సాయికుమార్, జి.యమునరాణి, ఆర్.లక్ష్మినాయుడు, సంయుక్త కార్యదర్శులగా డి.తవిటమ్మ, ఎస్.కోటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, జె.నారాయణ, ఎస్.రమేష్, కె.రవికు మార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఘనంగా బీపీ మండల్ జయంతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్ అని బీసీ సంఘ నాయకులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో బీపీ మండల్ జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు శ్రీకాకుళం జిల్లా బీసీ సంఘాల అధ్యక్షులు అమీరుల్లా బేగ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, అధ్యక్షులు బాదాన దేవభూషణ్, అంబేడ్కర్ సలహామండలి సభ్యులు బీసీ నాయకులు రాజేష్, ఎంబీసీ ఉత్తరాంధ్ర సెక్రెటరీ రౌతు శంకరరావు, ఎంబీసీ నాయకులు కృష్ణంరాజు, పద్మశాలి సంఘ నాయకులు, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.


నందిగాం సర్వీస్ రోడ్‌లో రాంగ్‌రూట్‌లో ఆటో రావడంతో ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్ వాహనం

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతీ జెన్నా


మాట్లాడుతున్న రాష్ట్ర మాస్ ఎడ్యుకేషన్, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రి నిత్యానంద గోండ్

పర్లాకిమిడి: ఒడిశాలో వర్కింగ్ జర్నలిస్టులకు పెన్షన్, అక్రిడేషన్లు, రూ.20లక్షల బీమా, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే అసెంబ్లీలో ప్రస్తావిస్తామని రాష్ట్ర రవాణా, ఖనిజ, వాణిజ్య శాఖల మంత్రి బిభూతీ జెన్నా అన్నారు. పర్లాకిమిడి కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఒడిషా రాష్ట్ర జర్నలిస్టుల ప్రథమ ద్వైవార్షిక సమావేశాన్ని మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర మాస్ ఎడ్యుకేషన్, ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ మంత్రి నిత్యానంద గోండ్, బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి, చికిటి ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఎస్పీ చంద్రశేఖర హోత్తా తదితరులు సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి జెన్నా మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన దారుణం మీడియా వల్లే వెలుగు చూసిందన్నారు. రాష్ట్రంలో పదిహేనేళ్లుగా వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వడం లేదని తెలిసిందని, దీనిని ముఖ్యమంత్రి మోహన్ మాఝికి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులకు మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. ఓ.యు.జె.ద్వైవార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న మహంతి, రాష్ట్ర కార్యదర్శి కోంభపాణి మిశ్రా, గజపతి జిల్లా ఓ.యు.జె.అధ్యక్షుడు బసంత్ కుమార్ పండా, కార్యదర్శి కె.రామస్వామి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జీబ సర్పంచ్‌గా ఎడంగా


ఎడంగా శోబోరోను అభినందిస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి జీబ పంచాయతీ సర్పంచ్‌గా ఎడంగా శోబోరో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందున్న రవీంద్ర శోబోరో ఎన్నికల్లో తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారని కేసు పెట్టారు. దీంతో ఎడంగా శోబోరోను అధికారులు పదవి నుంచి తొలగించారు. అనంతరం ఎడంగా శోబోరో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కేసును విచారించిన సుప్రీంకోర్టు ఎడంగానే సర్పంచ్‌గా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సర్పంచ్‌గా ఎడంగాను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆకట్టుకున్న కార్టూన్ షో

- సరస్వతీ శిశు విద్యామందిర్‌లో కార్టూన్ షో.


కార్టూన్ షో వద్ద నిర్వాహకులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ఆదివారం కార్టూనిస్టు శేఖర్‌బాబు వన్‌మ్యాన్ కార్టూన్ షో నిర్వహించారు. కోవిడ్ వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణ మార్పులు తదితర అంశాలపై కార్టూన్లు ప్రదర్శించారు. అనంతరం సరస్వతీ శిశు విద్యామందిర్ మేనేజింగ్ కమిటీ ఉపాధ్యక్షులు సంజయ్ జెన్నా, ప్రమోద్ కుమార్ పాఢిలు శేఖర్‌బాబును జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్ కుమార్ పండా, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కొరాపుట్: బ్రహ్మపుర రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రేమ్‌నగర్‌లోని ఆర్‌సీఎస్ హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ప్రియజిత్ జెనా, నిహార్ రంజన్ సాహు, ఎస్.సంతోష్‌కుమార్, గౌరవ్‌కుమార్ సాహు, మహేష్ మహాపాత్రో, బి.రూప బీపీ, ఈసీజీ, ఎస్‌పీఓ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మపుర రోటరీ క్లబ్ చైర్మన్ సంతోష్‌కుమార్ రథ్, సెక్రటరీ కె.వి.జి.రవికుమార్, కోశాధికారి వారణాశి సత్యనారాయణ పాల్గొన్నారు.

## అమరవీరులకు నివాళులు


సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు

కొరాపుట్: స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులకు రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలైన కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాలకు చెందిన శబరి సాంస్కృతిక షంశద్ అనే సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. పపడాహండి కాల్పుల ఘటనను గుర్తు చేసుకుంటూ సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేసింది. నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే, శాసన సభాపక్ష నాయకుడు రాంచంద్ర ఖడం, విశ్రాంత ఇంజినీర్ ఇన్ చీఫ్ గోదావరిష్ మహాపాత్రో, మల్కనగిరి జిల్లాకు చెందిన మాజీ మంత్రి అరవింద దాలి తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి

కొరాపుట్: బీజేపీ సభ్యత్వ నమోదును కార్యకర్తలు విజయవంతం చేయాలని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పిలుపునిచ్చారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం మజ్జిగూడలోని బీజేపీ కార్యాలయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిషోయి, మాజీ ఎంపీ పరశురాం మజ్జి, నాయకులు దేవదాస్ మహాంకుడో, ప్రహ్లాద్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## తిలక్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. తిలక్‌తో పాటు మండల నాయకులు ఆదివారం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో కణితూరు గ్రామానికి చెందిన బండారు చాణుక్య అనే వ్యక్తిని పరామర్శించి తిరిగి వాహనంలో వస్తుండగా నందిగాం సర్వీస్ రోడ్‌లో ఫ్లై ఓవర్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో హటాత్తుగా ఓ ఆటో రావడంతో దాన్ని తప్పించబోయి ఢీకొన్నారు. ప్రమాదంలో నందిగాం మండలం బెజ్జిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పొందర తేజారావు, ఆయన భార్య అరుణకుమారికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108కు సమాచారం ఇచ్చినప్పటికీ వాహనం అందుబాటులో లేకపోవడంతో సమీపంలో ఉన్న ఎస్‌హెచ్16 వాహనంలో క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై తిలక్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఘటనపై ఆరా తీశారు. నందిగాం పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### ఘనంగా విజయభావన సాహితీ సదస్సు



మంగిపూడిని సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సు 538వ సభను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. హరికథల్లో హాస్యరసం అనే అంశంపై ఈ సందర్భంగా వక్తలు ప్రసంగించారు. బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు పీవీ రమణమూర్తి సభాధ్యక్షత వహించగా ప్రముఖ హరికథ రాజహంస మంగిపూడి వేంకటరమణమూర్తి భాగవతార్ వక్తగా పాల్గొన్నారు. హరికథల్లో హాస్యాన్ని సందర్భోచితంగా పాడి వినిపించారు. సమ్మానకర్తగా విజయభావన సభ్యుడు పి.నాగార్జున వ్యవహరించారు. కార్యక్రమంలో విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, జక్కు రామకృష్ణ, భోగరాజు బాబూజీ, సూర్యలక్ష్మి, వారణాశి నరసింహమూర్తి, విజయభావన అధ్యక్షుడు దామరాజు శంకరం తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్స్ తైక్వాండో పోటీలకు 21 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర శివారులో గల విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 55 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు హాజరైన క్రీడాకారుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 31 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని సాంస్కృతిక కళాశాలలో జరగనున్న 40వ అంతర్ జిల్లాల సీనియర్స్ తైక్వాండో పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతగా అనిల్‌కుమార్ శర్మ వ్యవహరించారు.

### పుస్తక పఠనంతో అపార జ్ఞానం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తకాలు ఎలా చదవాలి, అందులోని విషయాలను ఏ విధంగా అవగాహన చేసుకోవాలన్న విషయాలను లైబ్రేరియన్ వివరించారు. గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని, జ్ఞానాన్ని విస్తృతం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, అలా అయితే జ్ఞానంలో అందరి కన్నా ముందుంటారన్నారు. విద్యార్థులు ఎక్కువగా నీతికథలు చదవాలని, ప్రతీ కథలో ఒక్కో రీతిలో నీతి ఉంటుందని, దానిని విద్యార్థులు గుర్తించి, అలవర్చుకోవాలన్నారు. అనంతరం కథలు చెప్పడం, రాయడం, చిత్రలేఖనం, కోలాటంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తెర్లాం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

### అండర్-9 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: అంతర్ జిల్లాల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా అండర్ -9 క్రీడాకారుల ఎంపికలు ఆదివారం పూర్తయ్యాయి. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారుల్లో బాలికల విభాగంలో బి.జశ్విక ప్రథమ స్థానం దక్కించుకోగా... ఖ్యాతిశ్రీ ద్వితీయ స్థానం చేజిక్కించుకుంది. బాలుర విభాగంలో బి.అభినవ్, ఆర్.హేమనాగ హర్షిత్‌లు మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరు వచ్చే నెల 21, 22 తేదీల్లో విజయనగరం వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా కార్యదర్శి కెవి.జ్వాలాముఖి తెలిపారు. పోటీలను జిల్లా సంయుక్త కార్యదర్శి ఎం.గణేష్‌నాయుడు, అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

# దారి కాచిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం
- తండ్రిని హత్తుకుని ప్రాణాలు వదిలేసిన కుమారుడు
- బంటుపల్లి యూబీ పరిశ్రమ ఎదుట ఘటన



మృతుడు కరణం రామకృష్ణ (ఫైల్)



మృతుడు కరణం కిరణ్ కుమార్ (ఫైల్)



యూబీ పరిశ్రమ ఎదుట ప్రమాద స్థలంలో విగతజీవుల్లా పడి ఉన్న తండ్రీకొడుకు, ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న జేఆర్ పురం పోలీసులు

రణస్థలం: తండ్రీ కొడుకులను మృత్యు దేవత మింగేసింది. ఇంటి ఆడబిడ్డను చూసి వస్తుండగా దారి కాచి మరీ దాడి చేసింది. మండలంలోని బంటుపల్లి యూబీ పరిశ్రమ ఎదుట జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రికొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..
విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని ఉప్పర నాయుడు వలసకు చెందిన తండ్రీకొడుకులు కరణం రామకృష్ణ(52), కరణం కిరణ్ కుమార్(20)లు ఆదివారం భోగాపురం మండలంలో గల మిరాకిల్ కళాశాలలో చదువుతున్న కిరణ్ చెల్లి సాత్వికను చూసేందుకు స్వగ్రామం నుంచి బైక్‌పై బయల్దేరారు. ఇటీవల రాఖీ పండగకు చెల్లి రాలేకపోవడంతో ఆమెను చూసేందుకు ఇద్దరూ బయల్దేరారు. ఆడబిడ్డను చూసి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో యూబీ పరిశ్రమ ఎదుట వెళ్తుండగా వీరి బండిని లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రి కరణం రామకృష్ణ, కుమారుడు కరణం కిరణ్ కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరిలో ఎవరూ హెల్మెట్ పెట్టుకోలేదు. హెల్మెట్‌ను బైక్‌కు తగిలించి ఉండడం గమనార్హం. అయితే ప్రమాదం నిర్దిష్టంగా ఎలా జరిగిందో పోలీసులు అంచనా వేయలేకపోతున్నారు. లారీ ఢీకొట్టాక తండ్రీకొడుకులు ద్విచక్రవాహనంపై కూర్చొని పక్కకు ఒరిగిపోయినట్లు పడిపోయారు. ఇద్దరి తలలు రోడ్డుకు బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశారు. తండ్రిని కొడుకు హత్తుకుని నడిరోడ్డుపై విగతజీవుల్లా ఉన్న దృశ్యం అక్కడున్న వారిచేత కంట తడి పెట్టించింది. మృతుడు కిరణ్‌కుమార్ విజయనగరంలోని సీతం కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తల్లి రాణిరత్నం అంగన్‌వాడీ టీచర్. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## వీడిపోని రక్తసంబంధం

- ఘొల్లుమన్న ఉప్పర్నాయుడువలస



రోదిస్తున్న రామకృష్ణ కుటుంబసభ్యులు

రేగిడి: ఆ యువకుడు తండ్రితో కలిసి వెళ్లి చెల్లిని చూసి ఎంతో ఆనందించాడు. నువ్వు రాఖీ పండగకు రాకపోవడంతో నేనే నీ దగ్గరకొచ్చాను చెల్లీ అని అన్నయ్య అనడంతో చెల్లి ఎంతో సంబరపడిపోయింది. చెల్లితో రాఖీ కట్టించుకుని నేను బాగా చదువుతున్నాను..నువ్వు బాగా చదువుకో అని జాగ్రత్తలు చెప్పి తండ్రితో కలిసి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. అక్కడి నుంచే ఫోన్‌లో తన చెల్లికి తల్లితో కూడా మాట్లాడించాడు. ఇదంతా జరిగి కనీసం గంట సమయం కాకముందే అన్నయ్యతో పాటు చూసేందుకు వచ్చిన తండ్రి కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకుని ఆ చెల్లి సొమ్మసిల్లి పడిపోయింది. మరో వైపు తండ్రీకొడుకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసి వారి స్వగ్రామం రేగిడి మండలం ఉప్పర్నాయుడువలస ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ విషాద సంఘటన వివరాలిలా ఉన్నాయి.
గ్రామానికి చెందిన కరణం రామకృష్ణ (46), కుమారుడు కిరణ్‌కుమార్(20)లు ఆదివారం రణస్థలం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. రామకృష్ణకు కొడుకు కిరణ్‌కుమార్‌తో పాటు కుమార్తె సాత్విక, భార్య రాణీరత్నం ఉన్నారు. సత్యసాయి సేవా సంస్థల రాజాం జోనల్ కన్వీనర్‌గా సేవా కార్యక్రమాలు నిర్వహించే రామకృష్ణకు సొంత గ్రామంలో పంటపొలాలు ఉన్నాయి. ఓ వైపు తాను వ్యవసాయం చేస్తూ, భార్య రాణీరత్నం అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కుమారుడు కిరణ్‌కుమార్ విజయనగరంలోని సీతం కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం, కుమార్తె సాత్విక భోగాపురంలోని మిరాకిల్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల జరిగిన రాఖీ పండగకు అన్నాచెల్లెళ్లు కలుసుకోలేదు. ఈనెల 24న కిరణ్‌కుమార్ స్వగ్రామం ఉప్పర్నాయుడువలస వచ్చి తల్లిదండ్రులతో గడిపాడు. ఆదివారం తన చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు తండ్రి రామకృష్ణను తోడుగా తీసుకుని భోగాపురంలోని మిరాకిల్ కళాశాలకు వెళ్లాడు. అక్కడ చెల్లితో రాఖీ కట్టించుకుని, చెల్లిని తల్లితో ఫోన్‌లో మాట్లాడించి, తండ్రీ కొడుకులు తిరుగు పయనమయ్యారు. ఇంతలోనే హైవేపై లారీ ఢీకొట్టడంతో వారు ప్రయాణిస్తున్న బైక్‌తో రోడ్డుపై పడిపోయి తండ్రీకొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో భర్తతో పాటు కుమారుడు మృతిచెందిన విషయాన్ని రాణీరత్నం తట్టుకోలేకపోయింది. ఘొల్లుమంటూ దిక్కులు పిక్కటిల్లేలా... విలపించేలా రోదించింది.

## దళితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

- దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి



దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

విజయనగరం: జిల్లా ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ వారి ఉత్సవ వేడుకల్లో కీలకంగా వ్యవహరించే దళితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు భానుమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం పర్యటనకు వచ్చిన దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ పైడితల్లమ్మవారి జాతర మహోత్సవం ఎంతో ప్రసిద్ధి గాంచిందని, రాష్ట్ర పండగగా ప్రకటించారని, గత 200 సంవత్సరాలుగా పాలధార, అమ్మవారి పండగ చాటింపు, దేవర ఉత్సవంలో దళితులే సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ దళితులకు ఉద్యోగావకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దేవాదాయ శాఖలో దళితులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- వచ్చే నెల 14,15,16 తేదీల్లో గుంటూరులో పోటీలు



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి



రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి పరుగు పోటీ ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. నగరంలోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారికి 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల తదితర విభాగాల్లో పరుగు పోటీతో పాటు హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీశంకర్ ప్రారంభించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 14,15,16 తేదీల్లో గుంటూరు జిల్లాలో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి లీలాకృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు రిఫరీలుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్‌కిశోర్, తవిటినాయుడు, గురునాయుడు, బాబ్జీ, రామకృష్ణ, వర్మలతో పాటు సీనియర్ అథ్లెటిక్స్ కోచ్‌లు సతీష్, మధు, నర్సింగ్, శివ, చిన్నలు వ్యవహరించారు.

## మెగా డీఎస్సీ ఎలా?

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు



పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో స్కూల్‌అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు అధిక సంఖ్యలో మిగులు ఉపాధ్యాయులుగా ఉన్నారని గుర్తించి సర్దుబాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇటువంటి తరుణంలో 16 వేలకు పైగా ఉపాధ్యాయులను నియమిస్తామంటూ మెగా డీఎస్సీపై మొదటి సంతకం ఎలా చేశారని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఇప్పటికే ఉన్న జీఓల ప్రకారం సుమారు తొమ్మిది వేల పోస్టులు మిగులుగా ఉన్నట్లు గుర్తించారు. సుమారు వెయ్యి పోస్టుల వరకూ సర్దుబాటు చేయాలని యోచించారు. అయినా ఇప్పటికీ సర్దుబాటు ప్రక్రియ పూర్తికాలేదు. అది ఎప్పటికి అవుతుందో తెలియని పరిస్థితి. విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని సమీక్షించాలి. ఇటువంటి తరుణంలో మెగా డీఎస్సీ ఎలా సాధ్యపడుతుందని ఆయన ప్రశ్నించారు. 117 జీఓను రద్దు చేసి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక విద్యను, 6 నుంచి 10వ తరగతి వరకు సెకండరీ విద్యను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో సమాంతరంగా నిర్వహించాలని కోరారు. ఎన్నో ఆశలతో డీఎస్సీ నిర్వహిస్తారని ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు నిరాశ మిగల్చవద్దని ప్రభుత్వానికి హితవు పలికారు.

## అనధికార మందుగుండు తయారీదార్లపై కఠిన చర్యలు



మందుగుండు తయారీ, నిల్వ చేస్తున్న గొడౌన్‌ల యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో అనధికారికంగా మందుగుండు సామగ్రి తయారీ, నిల్వలు, విక్రయాలు చేసే వారిపై దాడులు నిర్వహించి, కఠినంగా వ్యవహరించాలని, ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదివారం ఆదేశించారు. ఈ మేరకు పోలీస్ అధికారులు, మందుగుండు తయారీదారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో లైసెన్స్ కలిగి మందుగుండు సామగ్రి, నిల్వలు, విక్రయాలు జరిపే గొడౌన్‌లు, షాపుల్లో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ, రక్షణ చర్యలు చేపడుతున్నదీ లేనిది పరిశీలించి, నివేదికలను అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో మందుగుండు విక్రయాలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు జారీచేసిన లైసెన్స్‌లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

పార్వతీపురం టౌన్: మండలంలోని కారాడవలస గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి గ్రామానికి చెందిన యువకుడు పామల శివశేషు (27) మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సిపురం పంచాయతీ కారాడవలసకు చెందిన శివశేషు హైదరాబాద్‌లో ప్రైవేట్‌గా పనులు చేసుకునే వాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి చెరువులో జారి పడిపోయాడు. ఇంటికి ఎప్పటికీ రాకపోవడంతో తల్లిదండ్రులు జ్యోతి, సింహాచలం, స్థానికులు గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు..**

గజపతినగరం రూరల్: మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన కాళ్ల రాములు(60) శనివారం రాత్రి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు గజపతినగరం ఎస్సై లక్ష్మణరావు ఆదివారం విలేకరులకు ఈ విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాములు గజపతినగరం నుంచి తన గ్రామానికి నడిచి వెళ్తుండగా మధుపాడ గ్రామ సమీపాన విశాఖ పాల డెయిరీ కేంద్రం వద్ద బైక్ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**రైలుఢీకొని మరో వృద్ధుడు..**

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస రైల్వేగేటు సమీపంలో రైలు ఢీకొట్టడం ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బండారు వీధికి చెందిన ధర్మవరపు చిన్నారావు(74)శనివారం రాత్రి రైల్వేలైన్ దాటుతుండగా అటుగా వస్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరభాగాలు చెల్లాచెదురై పడి ఉండడంతో తొలుత గుర్తించలేకపోయామని, ఆదివారం సాయంత్రం మృతెడి కుటుంబసభ్యులు గుర్తించారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలియజేశారు.

**విద్యుత్ షాక్‌తో మహిళ..**

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎన్నో రోజుల తర్వాత పుట్టింటికి వచ్చిన మహిళ ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మొండెఖల్లు గ్రామానికి చెందిన చెందిన గొడు కేశవ, నిన్నిల కుమార్తె సుధారాణి (30)ని ఒడిశాలోని పర్లాకిమిడి సమీపంలో గల సింగుపూర్ గ్రామానికి చెందిన విజయ్‌కు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు. ఎన్నో రోజుల తర్వాత సుధారాణి శనివారం పుట్టింటికి వచ్చింది. వారి పెంకుటింటిలోని విద్యుత్ మీటర్ సమీపంలో ఉన్న వైరు ప్రమాదవశాత్తు సుధారాణి చేతికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎక్కడో విద్యుత్ వైర్ తెగి ఇంటి గోడల్లోకి విద్యుత్ సరఫరా అవుతోందని, వచ్చి సరిచేయాలని విద్యుత్ సిబ్బందికి ఆదివారం ఉదయమే ఫిర్యాదు చేసినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. ఈ సంఘటనపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కన టేబుల్‌లో కూరగాయల ధరలు చూసి ఆశ్చర్యపోతున్నారు కదా..! ఎక్కడ అలా దొరుకుతున్నాయో తెలుసుకుని బ్యాగ్ తీసుకుని వెంటనే వెళ్లి కొనుగోలు చేయాలనుందా? ఇంత చవకగా ఎక్కడ దొరుకుతున్నాయని ఆరా తీయాలనుందా? ఆగండాగండి..ఇంత చవకగా మార్కెట్‌లో ఎక్కడా కూరగాయలు దొరికే పరిస్థితి లేదు. కానీ ఇవే ధరలకు తాము గిరిజన పాఠశాలలకు సరఫరా చేస్తామంటూ టెండర్లు దాఖలు చేశారు కొందరు వ్యాపారులు. మరి టెండర్‌లో పొందుపరిచిన రేట్లకు సక్రమంగా, నాణ్యమైన కూరగాయలు సరఫరా చేస్తారా? లేదా అన్నది చర్చనీయాంశంగా ఉంది.



| ధరల నిర్ణయం ఇలా.. | |
|---|---|
| కూరగాయలు | కిలో (రూ.లు) |
| బీరకాయలు | 1 |
| బీట్‌రూట్ | 1 |
| కాలీప్లవర్ | 1 |
| చిక్కుడు | 1 |
| అల్లం | 1 |
| పచ్చిమిర్చి | 1 |
| మునగకాడలు | 1 |
| ముల్లంగి | 1 |
| అరటికాయలు | 1 |
| క్యారెట్ | 1 |
| గుత్తివంకాయ | 1 |
| పాలకూర | 1 |
| మెంతుకూర | 1 |
| గొంగూర | 1 |
| బంగాళా దుంపలు | 32 |
| ఉల్లిపాయలు | 15 |
| వంకాయలు | 18 |
| దొండకాయలు | 25 |
| బెండకాయలు | 18 |
| టమాటో | 10 |
| క్యాబేజీ | 18 |
| ఆనపకాయలు | 12 |
| అరటిపండ్లు | 18 |
| జామ పండ్లు | 41 |

- పచ్చిమిర్చి కూడా కిలో రూపాయే
- 22 రకాల కూరగాయలు రూ.175 నుంచి 230

# రూపాయికే కిలో అల్లం!



సీల్డ్ టెండర్‌లు తెరుస్తున్న ఇన్‌చార్జ్ పీవో, ఇతర అధికారులు (ఫైల్)

సీతంపేట: కూరగాయల ధరలు బయట మార్కెట్‌లో తారెత్తిస్తున్నాయి. ఏ కూరగాయ చూసిన మార్కెట్‌లో కిలో రూ.30 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సామాన్యుడి నుంచి ధనవంతుల వరకు కూరగాయలు కొనుగోలు చేయాలంటే వెనుకడుగు వేస్తున్న పరిస్థితిని ఇటీవల చూస్తున్నాం. అల్లం కిలో రూ.140 పలుకుతోంది. పచ్చిమిర్చి వంటివి అవేదారిలో ఉన్నాయి. కానీ గిరిజన గురుకులాలకు కూరగాయలు సరఫరా చేసే టెండర్‌దారులు మాత్రం కిలో రూపాయికే అల్లం, పచ్చిమిర్చి, ఇతర కూరగాయలు సరఫరా చేస్తామంటూ ముందుకు రావడం చర్చనీయాంశమైంది.

వివరాలు పరిశీలిస్తే గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు సక్రమంగా మెనూ అందివ్వడానికి వీలుగా నాణ్యమైన కూరగాయల సరఫరాకు ప్రతి ఏటా టెండర్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఈనెల 21న టెండర్లను నిర్వహించారు. ఈ మేరకు 23న ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ వీవీ రమణ టెండర్ ప్రొసీడింగ్స్‌పై సంతకం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ టెండర్‌లలో సంబంధిత టెండర్ దారులు సిండికేట్‌గా మారారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 10 మంది టెండర్‌దారులు కూరగాయల టెండర్‌లకు హాజరయ్యారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఈఎంఆర్ఎస్‌లు 2, మినీగురుకులాలు 2, గురుకుల జూనియర్ కళాశాలలు 4, పాఠశాలలు 5 ఉన్నాయి. వాటిలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారికి మూడుపూటలా సరైన మెనూ అందివ్వాల్సి ఉంది. గురుకులం సొసైటీ నిబంధనల ప్రకారం కూరగాయలు, పండ్లు, చికెన్ వంటి వాటికి టెండర్‌లు పిలుస్తారు. దీన్ని ఆసరాగా చేసుకుని సంబంధిత టెండర్‌దారులు సిండికేట్‌గా మారి చౌకగా టెండర్లు కాజేసుకుని రెండేసి స్కూల్స్‌కు ఒక్కొక్కరు టెండర్ దక్కించు కున్నారు.

**అన్ని కూరగాయలు తక్కువ ధరకే..**

22 కూరగాయలు కలిపి సీతంపేట బాలురు పాఠశాలకు ఒక టెండర్ దారుడు కిలో రూ.230కి టెండర్ దక్కించుకున్నాడు. బాలికల పాఠశాల, సీవోఈ మల్లి కళాశాలకు కిలో రూ.210కి, మల్లి బాలుర పాఠశాలకు రూ.200, సీతంపేట బాలుర గురుకులానికి రూ.195, బాలికల జూనియర్ కళాశాలకు రూ.175, మినీగురుకులం సీతంపేటకు రూ.185, పెద్దమడి జూనియర్ కళాశాల, పాఠశాలకు రూ.200, మెళియాపుట్టి ఈఎంఆర్ఎస్‌కు రూ.185, ఈఎంఆర్ఎస్ భామినికి రూ.180, కారిగూడ మినీగురుకులానికి రూ.185 కి సరఫరా చేయడానికి టెండర్‌లు ఖరారయ్యాయి. చివరకు చికెన్ కూడా కిలో పేపర్ రేటుపై రూ.86 తగ్గించి సరఫరా చేసేందుకు ముందుకు రావడం కొసమెరుపు. ఇలా చౌకబారు టెండర్లు దక్కించుకున్న వారు గురుకుల విద్యాసంస్థలకు ఎటువంటి కూరగాయలు సరఫరా చేస్తారో వారికే ఎరుక.

### గతంలో ఇదీ పరిస్థితి..

గతంలో కూడా గిరిజన గురుకులాలకు అన్ని కూరగాయలు కలిపి రూ.200, రూ.220 మధ్య టెండర్‌లు కాజేసుకుని సక్రమంగా సరఫరా చేయలేని పరిస్థితి ఉంది. కుళ్లిపోయిన కూరగాయలు, ఆ సీజన్‌లో చౌకగా లభించే వాటిని సరఫరా చేశారు. ఒక వ్యాపారి అలా కుళ్లిన వాటిని, చౌకబారు కూరగాయలను సరఫరా చేస్తున్నారని సంబంధిత గురుకులాల ప్రిన్సిపాల్స్ కూడా టెండర్లు జరిగిన రోజు అధికారులకు తెలియజేశారు. అయితే గురుకులం నిబంధనల ప్రకారం రోజువారీ కూరగాయలు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయడానికి వీలుండదు. టెండర్‌దారులు సరఫరా చేసిన వాటిని మాత్రమే విద్యార్థులకు వండి వడ్డించాల్సి ఉంది. ఈ క్రమంలో ఎక్కువగా ఆనపకాయలు, బంగాళాదుంపలు, వంకాయ, క్యాబేజీ ఆకు, బుట్ట వంటివి టెండర్‌దారులు సరఫరా చేసి చేతులు దులుపుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

### సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు

టెండర్‌దారులు సక్రమంగా సకాలంలో నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయకపోతే చర్యలు తప్పవు. కూరగాయల సరఫరాలో ఎటువంటి నాణ్యత లోపించినా టెండర్‌లను రద్దు చేసి వారిని బ్లాక్‌లిస్టులో పెడతాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట